(13 వ పేజీ తరువాయి)

జాజి తీగక్కమ్మ గొబ్బియాలో
పూత పూతక్కమ్మ ,,
ఏమి పూతక్కమ్మ ,,
జాలారి గుంతల్లో ,,
జాజి పూతక్కమ్మ ,,
పిందె పిందెక్కమ్మ ,,
ఏమి పిందెక్కమ్మ ,,
జాలారి గుంతల్లో ,,
జాజి పిందెక్కమ్మ ,,
కాయ కాయక్కమ్మ ,,
ఏమి కాయక్కమ్మ ,,
జాలారి గుంతల్లో ,,
జాజికాయక్కమ్మ ,,
పండు పండక్కమ్మ ,,
ఏమి పండక్కమ్మ ,,
జాలారి గుంతల్లో ,,
జాజి పండక్కమ్మ ,,

గొబ్బిల్లో ఆ పండు కొండపోయి ఎవరింట
పెడుతూ గొబ్బిల్లో

,, ముగ్గురాళ్ళ నాగిరెడ్డినట్టింట బెడుతూ ,,
,, ముగ్గురాళ్ళ నాగిరెడ్డి ఏమిచ్చి పండు ,,
,, ఎండిచ్చె ఎండందనమిచ్చె ఏమిచ్చె
పండు ,,
,, ఎండికుచ్చుల గొడుగులిచ్చె ఏమిచ్చె
పండు "

ఇలా అనేకరకాల పాటలుపాడి గొబ్బిళ్లు తట్టి పేరంటం చేస్తారు. రాత్రి దేవిని నిద్ర పుచ్చి, ఉదయం మేల్కొలుపుతారు. మంట పాన్ని అలంకరించిన కూరగాయలతో కూర వండుతారు. దీనిని 'గొబ్బి' అంటారు. తర్వాత గౌరిని ఎవరూ తొక్కకుండా చెరువులో కానీ, బావిలోకానీ వేస్తారు. కొన్ని చోట్ల బొమ్మల కొలువు కూడా వేస్తారు.

ఈ పండగ ముఖ్యంగా స్త్రీల పండగ. గొబ్బి నృత్యంకూడా స్త్రీలే చేస్తారు. బాగా ముస్తాబై పట్టుచీరలు ధరించి ఆభరణాలు పెట్టుకొని పైటకొంగు కట్టుచెరుగులోచెక్కి గొబ్బి చుట్టూరా నిలబడి వలయాకారంగా తిరుగుతూ ఈ నృత్యాన్ని చేస్తారు. వారి కాళ్ళకింద రకరకాల ముగ్గులు అందంగా దర్శనమిస్తూ వుంటాయి. ఈనాటికీ ప్రతి ఇంటి ముంగిటా ముగ్గులు మనకు దర్శన మిస్తాయి. స్త్రీలు నైపుణ్యంతో అనేకరకాల ముగ్గుల్ని నేర్చుకొని ముంగిటవేస్తుంటారు.

ఇంకో గొబ్బినృత్యం పాటలో "గంగా గౌరీసంవాదం" వుంది. ఇద్దరూ పోట్లాడు కోవటం చివరికి "గౌరి" బయలుజేరటం. దీన్నే మైలపడింది, బయటజేరింది. రజస్వల అయ్యింది, బయటవున్నాను. ముట్టు అయ్యింది, మూలకూచున్న అని వాడుక. ఈ సమయంలో స్త్రీలు దేవుని గదులలోకి, పోకుండా మూడురోజులు రెండు పూటల స్నానం చేయాలి. అందుకోసం గౌరీదేవికి నీళ్ళు అవసరమయ్యాయి. గంగాదేవి కోపంతో నీటిని బిగించింది. గౌరి కొడుకు వీరన్నతో బాయి త్రవ్వించింది. నీళ్లు దొరకలేదు. చివరికి గంగకు శివున్ని అప్పగించటం, ఆ మె చేతిలో ఓడిపోవటంతో గేయం పూర్తి అవుతుంది. గేయములో "గొబ్బియాలో" అనే ఊతపదం రెండు సార్లు ఉచ్చరింపబడటంవల్లా గేయానికొక అందం సొగసుతనంవస్తుంది. ఒకరు పాడు తుండగా మిగిలినవారు వంత పాడుతారు. చేతుల చప్పట్లు లయగా గేయాని కనుగుణంగా కొడుతూవుంటారు.

గొబ్బియాలో యక్కావే గౌరమ్మ యలనంది
మేడ గొబ్బియాలో
,, వంచావే గౌరమ్మ వసగాని కొమ్మ ,,
,, కోసావే గౌరమ్మ కొలవరాసుల్లు ,,
,, మంచిమంచిపూలు తా ముడుచుకొంది ,,
,, వుత్తూలు వాడూలు గంగ కంపినాది ,,
,, వుత్తాపూవలు పంపిన్ని వనితాలెవ్వరు ,,
,, వత్తూలంపింది వనితా గౌరమ్మ ,,
,, సారిగా పంచాను సరిదానవేమే ,,
,, సారిదాని కాకుంటె సవితి నెట్లయితి ,,
, శివుడు తెచ్చినదాన్ని నీకు సరిలేని ,,
., కొట్టార గంగన్న పైమన్ను వూడ ,,
,, అక్కనీ హ స్తాన రాలిన్ని మన్ను ,,
,, నిలబడి యేరించు నిలువు గజ్జాలకు ,,
,, పండుకొనేరించు బండి జల్లాలకు ,,
,, కూచొనియేరించు వకటీ లేకుండా ,,
,, కొడుకూ వీరన్నకూ కోట గట్టించు ,,
., కొల్లి బద్రాద్రికి మేడ గట్టించు ,,
,, శివుడు కూచోనక్క శివగజ్జబెయ్యి ,,
,, మన ఇద్దరికీ వక్క మేడ గట్టించు ,,
., గంగమ్మ గౌరమ్మ గుద్దులాడంగ ,,
,, అంతలోకిగౌరమ్మ అంట్లాలోకి పోయింది
,, గౌరుస్నానము చేయ నీల్లులేవు ,,
,, కొడుకారోనాన కొడుకాకొడుకావీరన్నా ,,
,, వీరన్న బావిలో మాడు వీరన్నబావిలో
,, వీరన్నబాయిలో యిమిరిపోయినాయి
,, మల్లన్నబాయిలో వీరన్నచూడుబావిలో
,, మల్లన్నబాయిలో కూడిపోయినాయే ,,
,, ఇంటి ఇంటికన్నాబోరాకొడుకా వీరన్నా
,, ఇంటికాడక్క సుక్కన్న లేవు ,,
,, మి తాతింటికన్న బోరా వీరన్నా ,,
,, తాతింటికాడన్న వకసుక్కన్న లేవు ,,
,, పాలకాలిత్రొచ్చి చాచి పందిటానిలిచె ,,
,, నేతికావిత్రొచ్చి నెలవంక నిలిపి ,,
,, పాలనేతితో గౌరి తానములు ,,
,, సీమాలు గౌరును పీససాగినాయి ,,
,, నా కొడుకునిచ్చేను నీల్లుడుసుగంగా ,,
,, నీకున్ని కొడుకేమో నాకు లేదేమే ,,
,, నా కోల్లినిచ్చేను నీల్లుడిసుగంగా ,,
,, నీకున్ని కొల్లి నాకు లేదేమే ,,
,, నా శివుని నికిత్త నీల్లుడిసుగంగ ,,
,, ఆ మాటకు గంగమ్మ కిలకిల నగుచూ ,,
,, యేల్లకిందిడిసె యేలంతబుగ్గ ,,
,, మిడిమి కిందిడిసె మెడెమంత బుగ్గ ,,
,, నీటితో గౌరమ్మ స్నానమాడిందో ,,
,, శివుని గెల్చి గంగ కిలకిల నవ్వె ,,
,, వాడిపాయి గౌరమ్మ వారముసుకేసె ,,

ఇలాంటి పాటలు ఎన్నోదాగి వున్నాయి, గొబ్బి నృత్యం కూడా అడుగంటిపోయింది. పండుగనాడు గొబ్బి పెట్టి ముగ్గులు పోసి పండుగ చేసుకొని తినటం వరకు జరుగుతోంది. రానురాను తెలుగుజాతి సంస్కృతి ఆనవాయితిలు కూడా అడుగంటి పోతు న్నాయి. వాటిని అన్నింటిని తెలుసుకోవాలంటె జానపద సాహిత్యాన్ని వెలికి తీసి వాటిలోని విషయాన్ని అందరికి తెలియ జేయటం ముఖ్యం. సంక్రాంతి పండుగను మూడురోజులుచేసేవారట భోగి, సంక్రాంతి, కనుము అని. కానీ ఈనాడు ఒక్కరోజుకే గ్రామాల్లో పరిమితమైంది. ఇలాంటి స్త్రీల నృత్యాలు ఎన్నో అడుగంటిపోతున్నాయి. ఆదరణలభిస్తే మళ్ళీ చిరస్థాయిగా నిలిచిపోతాయి.

— శ్రీ చిగిచర్ల కృష్ణారెడ్డి